ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 25 మార్చి 2025



పథకం కోసం తరలించిన పైపులు

అనుసంధానం.. ఆలస్యం

- గోదావరి జలాలు బనకచర్లకు తరలింపుపై ఖరారు కాని డిజైన్
- భూ సేకరణ ప్రక్రియను నిలిపేసిన రెవెన్యూ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. 2026 జూన్ కల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా చేపట్టిన జలహారతి ప్రాజెక్టు ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జలహారతి పేరుతో చేపట్టిన పనులు భూ సేకరణ దశలోనే ప్రస్తుతానికి ప్రభుత్వం ఆపేసింది. జలహారతిలో గోదావరి-బనకచర్ల అనుసంధానానికి ప్రభుత్వం గతంలో ప్రణాళికను విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే ఇంత వరకు ప్రక్రియ వేగంగా జరగడంతో గోదావరి జలాలు కుడి కాల్వకు వచ్చే కాలం అతి దగ్గరలోనే ఉందని ఆయకట్టు రైతులు ఆశపడుతున్నారు. అయితే వారిని నిరాశపరుస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు భూసేకరణ దశలో నిలిపివేయడంతో కుడి కాల్వకు గోదావరి జలాలు తరలించే ఎత్తిపోతల పథకం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

జలహారతి తొలివిడత ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందుతారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించేందుకు ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ చేపట్టారు. ఈ పనులను మూడు దశల్లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. రూ.6020 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా రూ.465 కోట్ల పనులు పూర్తయ్యాయి. రెండో ప్యాకేజీలో రెండు పంపు హౌస్ లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలో మీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్ స్టేషన్లు నిర్మించాలి. ఈ ప్యాకేజీలో రూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466.31 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రూ.181 కోట్ల వ్యయం అవుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేయగా ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూ సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ దశలో గోదావరి జలాలను బనకచర్లకు తరలించే ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ డిజైన్‌కు తుది రూపు వచ్చే వరకు భూసేకరణను వాయిదా వేశారు. దీంతో భూసేకరణను రెవెన్యూ శాఖ నిలిపివేసింది. డిజైన్‌ను ప్రకటించిన అనంతరమే భూసేకరణ ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. అమరావతి, క్రోసూరు, రాజుపాలెం నకరికల్లు మండలాల పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురుచూస్తున్నారు.



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

మళ్లీ.. హ్యాపీనెస్ట్



హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు ఊహాచిత్రం

నాడు రూ.714 కోట్లు.. నేడు రూ.930 కోట్లు

హ్యాపీనెస్టు గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాట్లను కొనుగోలుదార్లకు 2021 నాటికే అప్పగించాలి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. తొలుత రూ.714 కోట్ల ప్రాజెక్టును షాపూజీ పల్లోంజీ పనులు చేపట్టగా రివర్స్ టెండరింగ్ అంటూ జగన్ ప్రభుత్వ నిర్ణయంతో పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో విపరీతమైన జాప్యంతో నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.930 కోట్లకు పెరిగింది. గత డిసెంబరులో టెండర్లను పిలవగా ఎన్‌సీసీ సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (మంగళవారం సాయంత్రం) సహరి : 4.52 (బుధవారం ఉదయం)

రాజధాని అమరావతిని అత్యద్భుతంగా నిర్మించే క్రమంలో అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. అంతర్జాతీయ స్థాయి వసతులతో హ్యాపీనెస్ట్ పేరుతో గృహ సముదాయాలకు గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల నుంచి ఊహించని స్పందన రావడంతో ఫ్లాట్ల బుకింగ్‌లు శరవేగంగా జరిగాయి. ఇక రాజధానిలో తమ కలల గృహం.. కృష్ణా నదీ సమీపంలో నేల పాడులో నిర్మాణం జరుగుతుందని ఫ్లాట్ల కొనుగోలుదారులు ఆనంద డోలికల్లో ఉన్నారు. అయితే వారి కలలను కల్లలు చేస్తూ.. వారి ఆశలను చిదిమేస్తూ గత వైసీపీ ప్రభుత్వం అమరావతి తో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును కూడా పక్కన పెట్టేసింది. రూ.లక్షలు చెల్లించిన వారు గత ఐదేళ్లు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం..

అమరావతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో హ్యాపీనెస్టు కొనుగోలుదారుల్లో ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన హ్యాపీనెస్టు ప్రాజెక్టును చంద్రబాబు పట్టాలపైకి తీసుకురావడంతో కొను గోలు దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. జగన్ ప్రభుత్వమే తమను మోసం చేసిందని ఆందోళన చెందుతున్న ఫ్లాట్ల కొనుగోలుదార్లకు కూటమి ప్రభుత్వం అభయమిచ్చి పాత రేట్లపైనే నిర్మాణాలు పూర్తి చేసి అప్పగించేలా విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఆర్‌డీఏ రీ టెండర్లు నిర్వహించగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులను దక్కించుకుంది. త్వరలో హ్యాపీనెస్టు పనులు ప్రారంభం కానున్నాయి.



కొనుగోలు దార్లకు అభయం

- ప్రాజెక్టును పట్టాలెక్కిస్తోన్న ప్రభుత్వం
- రీ టెండర్.. నేలపాడులో పనులు ప్రారంభం
- పాత రేట్లపైనే పూర్తి చేసి అప్పగిస్తామని ప్రకటన
- జగన్ నిర్వాకంతో రూ.216 కోట్లు పెరిగిన వ్యయం



ప్రాజెక్టు స్థలం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో జనాభాను పెంచే లక్ష్యంతో 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును చేపట్టింది. నేలపాడు వద్ద హ్యాపీనెస్ట్ పేరుతో గేటెడ్ కమ్యూనిటీని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతితో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో హ్యాపీనెస్ట్‌లో ఫ్లాట్ల కోసం డబ్బులు చెల్లించిన అనేకమంది గగ్గోలు పెట్టారు. కొందరు ఒత్తిడి చేసి డబ్బులను వెనక్కు తీసుకోగా.. మరికొందరు దింపుడు కళ్లెం ఆశతో ఎదురుచూశారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు హ్యాపీనెస్ట్‌కు డబ్బులు చెల్లించిన వారందరికీ తీపి కబురు చెప్పారు. ఐదేళ్లపాటు ఆలస్యమైనా.. నిర్మాణ వ్యయం రూ.216 కోట్ల మేర పెరుగుతున్నా దానిని సీఆర్‌డీఏనే భరిస్తుందంటూ బాధిత ప్లాట్ల దారులకు అభయమిచ్చి వారిలో ప్రభుత్వంపై నమ్మకాన్ని కల్పించారు.

2బీ+జీ+18 అంతస్తులుగా 12 టవర్లు

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో)

ప్రథమ పౌరులుగా గుర్తించాలి

- రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలి
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు రాజధాని గ్రామాల రైతులు వినతి
- ప్రతీ గ్రామానికి డీపీఆర్ :ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో 2014 డిసెంబరు 8 వరకు నివాసం ఉంటున్న వారిని ప్రథమ పౌరులుగా గుర్తించాలి. గత టీడీపీ ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్య, వైద్యాన్ని పునః ప్రారంభించాలి. అప్పట్లో ఇచ్చిన హెల్త్ కార్డులు ఇప్పుడు పని చేయడం లేదు. తిరిగి పథకం అమలు చేయాలి..' అని రాజధాని గ్రామాల రైతులు, కూలీలు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబును కోరారు. రాజధాని గ్రామాల రైతులు, కూలీలతో సోమవారం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు సమస్యలను రాజధాని గ్రామాల రైతులు కమిషనర్, ఎమ్మెల్యేకి ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ముంపు ప్రాంతమని అమరావతిని అవహేళన చేసిందని, ఈ పరిస్థితుల్లో పూడిపోయిన వాగులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచించారు. రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలన్నారు. రాజధానిలో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇస్తున్నారని దానిని మున్సిపాల్టీల్లో ఇస్తున్నట్లు రూ.21 వేలకు పెంచాలని సీపీఎం రాష్ట్ర సహాయక కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబురావు తెలిపారు. రాజధాని గ్రామాలలో పేదలకు ఉచిత సోలార్ పథకం అమలు చేయాలన్నారు. గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలన్నారు. అసైన్డ్ రైతులు కొందరికే కౌలు జమయ్యాయని మిగిలిన వారికి జమ చేయాలని దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రైతులు చెప్పిన సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణాలను ఎంత వేగంగా చేస్తున్నామో అంతేవేగంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు పెదపరిమి, తాడికొండ రైతులు ముందుకొస్తున్నారన్నారు. హామీ లేకుండా రూ.25 లక్షల వరకు ఇచ్చే రుణాలను అమలు చేయాలన్నారు. గ్రామాల అప్రోచ్ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా డీపీఆర్లు తయారు చేసి పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అమరావతి పింఛన్ అమలు చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



సమావేశానికి హాజరైన రైతులు, రైతు కూలీలు

27న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

- 44 పంచాయతీల్లో ఎన్నికలకు ఏర్పాట్లు
- ఎన్నికల సిబ్బందికి నేడు శిక్షణా తరగతులు

నరసరావుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 44 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నికల నిర్వహణకు నియమించిన సిబ్బందికి మంగళవారం నరసరావుపేటలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలు జరిగే ఉప సర్పంచ్‌ల వివరాలు.. పిడుగురాళ్ల మండలంలో కొనంకి, కామేపల్లి, కొత్తవెల్లంపల్లి, మాచవరం మండలంలో పిన్నెల్లి, వేమవరం, మాచవరం పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించనున్నారు. దాచేపల్లి మండలంలో కేసానుపల్లి, మాచర్ల మండలంలో రాయవరం, జమ్మలమడక, కారంపూడి మండలంలో నరమాలపాడు, ఒప్పిచర్ల, ఇనుపరాజుపల్లి, కారంపూడి, చింతపల్లి, పేటసన్నిగండ్ల, కాచవరం, చిన్నగార్లపాడు, దుర్గి మండలంలో ధర్మవరం, ముటుకూరు, వెల్దుర్తి మండలంలో బొదిలవీడు, రొంపిచర్ల మండలంలో కొత్తపల్లి, అలవాల, వడ్లమూడివారిపాలెం, అన్నవరప్పాడు, తురుమెళ్ల, అచ్చయ్యపాలెం, నరసరావుపేట మండలంలో ఉప్పలపాడు, అల్లూరివారిపాలెం, పాలపాడు, కాకాని, బెల్లంకొండ మండలంలో వెంకటాయపాలెం, బెల్లంకొండ, అమరావతి మండలంలో నెమలికల్లు, రాజుపాలెం మండలంలో ఉప్పలపాడు, రాజుపాలెం, అంచులవారిపాలెం, కుబాద్‌పురం, కొత్తబొదనం, ముప్పాళ్ల మండలంలో మాదల, రుద్రవరం, వినుకొండ మండలంలో చీకటీగలపాలెం, శావల్యాపురం మండలంలో గుంటుపాలెం, ఈపూరు మండలంలో కొండాయపాలెం, నూజెండ్ల మండలంలో జంగాలపల్లి పంచాయతీల ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారులు బాధ్యతతో పని చేయాలి

- ప్రజల అర్జీల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి
- కలెక్టర్

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 105 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, డీఆర్‌వో మురళి, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

అమరావతికే ప్రత్యేకాకర్షణ.. 8

సెంట్రల్ పార్కు



- శాఖమూరులో 300 ఎకరాల్లో ఏర్పాటు
- పార్కు మధ్య భారీ జలాశయం
- చుట్టూ పార్కులు, వినోద కేంద్రాలు
- హైలెట్‌గా వైల్డర్‌నెస్ పార్కు
- ఆరంభమైన పనులు



8

ఎయిర్ ట్యాక్సీ @ గుంటూరు

- అత్యాధునిక ప్రయాణ సాధనాన్ని ఆవిష్కరించిన గుంటూరు కుర్రోడు
- కేంద్రం అనుమతిస్తే ఎయిర్ అంబులెన్స్‌గా వాడుకునే అవకాశం

అచ్చంపేట సీఐ వెంకట ప్రసాద్ పై వేటు 8

- వీఆర్‌కు పంపుతూ ఐజీ ఆదేశాలు

రూ. 63 లక్షల పంచాయతీ నిధుల స్వాహా 6

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు నిధులు మంజూరు 8

రూ. 63 లక్షల పంచాయతీ నిధుల స్వాహా



సర్పంచ్ నోముల కృష్ణ

● కొప్పునూరు వైసీపీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు..?

● షోకాజు నోటీసు జారీ.. ● డీపీవో విచారణ

మాచర్లటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన పంచాయతీ నిధులను ఆ గ్రామ సర్పంచ్ తన పలుకుబడితో అప్పటి పంచాయతీ సెక్రటరీతో కలిసి స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలంలోని కొప్పునూరు గ్రామ పంచాయతీకి గత వైసీపీ ప్రభుత్వంలో రూ. 63 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ గ్రామ సర్పంచ్ నోముల కృష్ణ ఆ నిధులను కాజేసి తన జేబులో వేసుకున్నాడు. అప్పటి ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న నేతల సహకారం ఉండడంతో అధికారులు కూడా ఎదురు చెప్పలేక జీహుజూర్ అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు కోసం వెచ్చించాల్సిన ఆ నిధులను ఏ పనులు చేయకుండానే అభివృద్ధి పనులు చేసినట్లు తీర్మానం చూపించి సొమ్మంతా డ్రా చేసుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్ నిధులు దుర్వినియోగాన్ని గ్రామస్థులు శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో డీపీవోను విచారణ చేపట్టాలని లేఖ రాశారు. దీంతో అధికారుల తనిఖీలో సర్పంచ్ కృష్ణ ఖాతాకు రూ. 51 లక్షలు, బూడిద సైదులు ఖాతాకు రూ. 3 లక్షలు, పంచాయతీ డీఈవో జానీబాషాకు రూ. 2.50 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. ఈ పంచాయతీ పరిధిలో ఉన్న న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి రూ. 6 లక్షలు పన్ను చెల్లించినా పంచాయతీ అకౌంట్‌కు జమ కాలేదని అధికారులు నిగ్గు తేల్చారు. నిధుల దుర్వినియోగంలో పంచాయతీ అధికారుల పాత్ర కూడా ఉండడంతో తమను కాపాడాలని ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్‌కు దిగినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యాలయ అధికారులు సర్పంచ్ కృష్ణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమై సర్పంచ్ కృష్ణ చెక్‌పవర్ రద్దు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు రెండు దఫాలుగా నోటీసులు ఇచ్చినా సర్పంచ్ నోముల కృష్ణ నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటాం : ఎంపీడీవో

కొప్పునూరు సర్పంచ్ నోముల కృష్ణ నిధులు దుర్వినియోగం అంశం పంచాయతీ శాఖ జిల్లా ఉన్నతాధికారి (డీపీవో) దృష్టిలో ఉందని, చెక్‌పవర్ కూడా నిలిపివేయడం జరిగిందని, త్వరలోనే డీపీవో కొప్పునూరు పంచాయతీని పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రస్తుతానికి కొప్పునూరు పంచాయతీ బాధ్యతలు ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తెలిపారు.

బాపట్ల శిక్షణా కేంద్రానికి ఇద్దరు ఎంపీడీవోల బదిలీ

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఎంపీడీవోలను బాపట్ల మానవ వనరుల శిక్షణా కేంద్రానికి గజిటెడ్ ఫ్యాకల్టీగా బదిలీ చేశారు. పెదకూరపాడు ఎంపీడీవో పీ రామకృష్ణ, చేబ్రోలు ఎంపీడీవో కే లలితను బాపట్ల శిక్షణా కేంద్రానికి బదిలీ చేయాలని పీఆర్ కమిషనర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈవో జ్యోతి బసు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.

14 నెలలుగా జీతాలు అందక అవస్థలు

జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారు. గడచిన 14 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. జిల్లా పరిషత్‌లో ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్‌లోని ఇప్పటి పాలక వర్గం మొట్టమొదటి సమావేశంలో అనుమతి పొందిన తరువాత వారిని విధుల్లోకి తీసుకున్నారు. విధుల్లో చేరిన తర్వాత నెలకు రూ. 15000 చొప్పున జీతాలు చెల్లించారు. డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారికి జీతాల చెల్లింపులు నిలిపివేశారు. జీతాల చెల్లింపు కోసం పాలకవర్గం రూ.14 లక్షలు కేటాయించినా అధికారులు మాత్రం కనికరం చూపడం లేదన్న వాదన వినిపిస్తోంది. పెండింగ్ జీతాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ వాహన వినియోగం పెరగాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగం పెరగాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌కు వచ్చే విషవాయువులు ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. భవిష్యత్తు అంతా ఎలక్ట్రికల్ వాహన వినియోగంపై దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. బీజేపీ విద్యుత్ శాఖ ఓఎస్డీ ఏవీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ వాహన టెక్నాలజీలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. టెక్నికల్ మేనేజర్ మంజునాథ కులకర్ణి మాట్లాడుతూ డిజైన్ మోడల్ విద్యుత్ వాహనాలు మోటార్ సెలక్షన్ టార్క్ క్యాలిక్యులేషన్స్ అనే అంశాలను వివరించారు. అనంతరం వర్క్ షాపు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల్లో ముఖ్యమైనది బ్యాటరీ టెక్నాలజీస్ అన్నారు. ఫాస్ట్ చార్జింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య కృష్ణ సత్య, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం గోపీకృష్ణ, డాక్టర్ డీ చంద్రమౌళి, విభాగం కోఆర్డినేటర్ ఎం వీ ఉమామహేశ్వరి, ఆర్ఎస్ శ్రీనివాస్, ఏడీ రాజాజీ, డాక్టర్ సీహెచ్ పుణ్యశేఖర్, కోటిరెడ్డి, విభాగం టెక్నీషియన్స్ ప్రసాద్, అజయ్ బాబు, మనోహర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ.. హ్యాపీనెస్ట్



నేలపాడు వద్ద ఏడీసీఎల్ నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు తాలూకు గ్రౌండు

(5వ పేజీ తరువాయి)

నేలపాడు వద్ద ఓవైపు ఎన్-12, ఎన్-13ల మధ్య ఇంకోవైపు ఈ-7, ఈ-8ల మధ్య రహదారుల వెంబడి 14.46 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. మొత్తం 1200 ఫ్లాట్లు.. 12 టవర్లను 2బీ+జీ+18 అంతస్తులుగా నిర్మించాలని ప్రతిపాదించింది. అప్పట్లో ప్రాజెక్టు మొత్తం ఖర్చును రూ.714 కోట్లుగా అంచనా వేసి నిర్మాణ పనులను షాపూజీ పల్లోంజీ సంస్థకు అప్పగించింది. చదరపు గజం ధరను రూ.4049 వంతున నిర్ణయిస్తూ ప్రాజెక్టును ప్రకటించగా.. జనం ఎగబడి ఇంచుమించుగా 1185 మంది ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో ప్రాజెక్టు పనులు కేవలం పైల్స్ టెస్టింగ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారంతా గగ్గోలు పెట్టారు. వీరిలో సుమారు వంద మంది కావాలని కోరడంతో రూ.25 కోట్ల మేర అడ్వాన్స్‌లను ఇచ్చేశారు. బుక్ కాని 15 ఫ్లాట్లతో పాటు వంద మంది నగదు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం 115కు పైగా ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే బుక్ అయిన ఫ్లాట్లను మినహాయించి ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను కొత్తగా బుక్ చేసుకునేవారికి మాత్రం పెరిగిన నిర్మాణ వ్యయాన్ని బట్టి ఎస్ఎఫ్‌టీ రేట్లను నిర్ణయిస్తారు. పాతవారి నుంచి మాత్రం అదనంగా పైసా కూడా వసూలు చేయరు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో నెలరోజులుగా నీటి తోడివేత పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు రెండేళ్లకు పైబడి సాగనుండడంతో ఆ ప్రాంగణంలోనే కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లను కూడా నిర్మించారు. భవన నిర్మాణపనులను ఆరంభించేందుకు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

రెండేళ్లలో పనులు పూర్తి..

ఈ ప్రాజెక్టులో 1225, 2750 చదరపు అడుగుల విస్తీర్ణం కల ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 144 ఫ్లాట్లు డబుల్ బెడ్ రూమ్‌వి కాగా, 1036 త్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లుగా ఉంటాయి. మొత్తం విస్తీర్ణంలో అత్యధిక భాగం ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రోడ్ల కోసమే వినియోగించేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో అంతస్తులో రెండేసి పార్కింగ్ ఫ్లోర్లకు స్థానం కల్పించి మొత్తం 12 టవర్లలో కలిపి 1631 కార్లు, 1200 బైకులను పార్కింగ్ చేసుకునేలా వెసులుబాటును కల్పిస్తున్నారు. ఇవిగాక మరో రెండు ఎమినిటీస్ బ్లాకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

అవినీతి చేయకపోతే డబ్బులు వెనక్కి ఎందుకు ఇస్తున్నారు

మాజీ మంత్రి రజనికి ప్రత్తిపాటి సూటి ప్రశ్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట,మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఏ తప్పుచేయకపోతే, అవినీతికి పాల్పడకపోతే దోచిన డబ్బులు ఎందుకు వెనక్కు ఇస్తున్నారో, క్రషర్ వారితో రాయబారాలు ఎందుకు చేశారో చెప్పాలని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాజీ మంత్రి రజనీని ఉద్దేశించి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో పుల్లారావు మాట్లాడు తూ తనవద్దకే మనుషుల్ని రాయబారానికి పంపారని స్వయంగా ఎంపీ కృష్ణదేవరాయులు చెప్పలేదా, చేసిన తప్పులకు ఎంతటివారైనా మూల్యం చెల్లించుకోవాల్సిందేనని, చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. పసుమర్రు జగనన్న కాలనీ భూసేకరణ విషయంలో డబ్బులు గుంజి కేసుల భయంతో తిరిగి రైతులకు వెనక్కు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు. అవినీతి మంత్రిగా ముద్ర వేయించుకుని, ఇప్పుడు తప్పుచేయలేదంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి నిజాయితీపరుడైన ఎంపీపై కూడా నిందలు వేసే స్థాయికి వచ్చారన్నారు. ఆమె అవినీతిపై సొంతపార్టీవారే హైకోర్టుకు వెళ్ళిన విషయం అందరికీ తెలిసినదేనన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి సోమేపల్లి సాంబయ్య 6 సార్లు, తాను 6 సార్లు పోటీచేశామని, ఎవరైనా, ఎప్పుడైనా సరే, సొంతపార్టీ వారు మాపై హైకోర్టును ఆశ్రయించారా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు రాబట్టే సొంతపార్టీ వారే గత ఎన్నికల్లో గుంటూరుకు పంపించారని అన్నారు. ఆమె చేసిన తప్పులు కడుక్కోవడానికి ఆమె జీవితం సరిపోదని, ఆ తప్పులపై సొంతపార్టీవారే తేల్చుకోవడానికి క్యూలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో సోషల్ మీడియా ముసుగులో అసభ్య ప్రచారానికి తెరలేపి, విష ప్రచార సంస్కృతిని తీసుకొచ్చి, చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని అన్నారు. చేసిన అవినీతిని రూపాయితో సహా కక్కించేవరకు కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు. ఐ-టీడీపీ కోఆర్డినేటర్ పిల్లికోటి వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ఏనాడో చెప్పారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌పీ డిప్యూటీ సీఈగా

రాధాకృష్ణ బాధ్యతల స్వీకారం



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా వీ రాధాకృష్ణ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం గుంటూరులోని ఎన్ఎస్‌పీ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి వచ్చిన ఆయన డిప్యూటీ సీఈగా చార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన రాధాకృష్ణ 1992వ సంవత్సరంలో అసిస్టెంట్ ఇంజనీర్ హోదాలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో చేరారు. అక్కడ దీర్ఘకాలం విధులు నిర్వహించిన తర్వాత అన్నమయ్య, కడప వెలిగళ్ల ప్రాజెక్టుల్లో డీఈఈగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత కర్నూలు ఎస్ఆర్‌బీసీలో విధులు నిర్వహించారు. ఇటీవలే ఆయన్ని ఈఈ క్యాడర్‌లో ఎన్ఎస్‌పీ సీఈగా ప్రభుత్వం బదిలీ చేయడంతో సోమవారం ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తమ పరిధిలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

నిదానంపాటి అమ్మవారి

జాతర ఆదాయం రూ. 38,62,340

దుర్గి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి వివిధ రూపేణా సమర్పించిన కానుకలను సోమవారం ఆలయంలో లెక్కించగా రూ. 38,62,340లు ఆదాయం సమకూరింది. వివిధ రకాల సేవల ద్వారా రూ. 11,34,439, హుండీ ద్వారా



అమ్మవారి జాతర ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రూ. 27,27,901లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మబాయి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ. 9,05,532ల ఆదాయం ఎక్కువగా సమకూరిందన్నారు.

వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమా?

పిడుగురాళ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత హత్య జరిగిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... జానపాడు గ్రామానికి చెందిన తాటి కొండలు, ఆదిలక్ష్మి దంపతులు పిడుగురాళ్ల పట్టణంలో సున్నపు బట్టీలలో కార్మికులుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బట్టీలో మేస్త్రీగా పని చేసే ఏడుకొండలుతో ఆదిలక్ష్మికి పరిచయం ఏర్పడింది. దీంతో భర్త కొండలను వదిలేసి ఏడుకొండలతో ఐదు సంవత్సరాలుగా తనకు ఉన్న ఇద్దరు పిల్లలలో పిడుగురాళ్ల పట్టణంలోని మారుతీ నగర్‌లో నివాసం ఉంటుంది. సోమవారం తెల్లవారుజామున ఏడుకొండలు బట్టీ పనికి వెళ్లగా.. రోజు మాదిరిగానే పిల్లలు అమ్మమ్మ పార్వతమ్మ వద్ద నిద్రించి తిరిగి ఉదయాన్నే ఇంటికి రాగానే రక్తం కనిపించటం, ఇంట్లో అమ్మ కనిపించకపోవటంతో అమ్మమ్మకు, బంధువులకు, స్థానికులకు సమాచారం అందజేశారు. బంధువులు, స్థానికులు విషయం వెంటనే పోలీసులకు తెలియజేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. అయితే దారిపొడవునా రక్తపు మరకలు ఉండటంతో ఆ రక్తపు మరకలను ఫాలో అవుతూ పోలీసులు వెళ్లారు. మారుతీ నగర్‌కు దూరంగా నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న క్వారీ గుంత వద్ద రక్తపు మరకలు, ఆదిలక్ష్మికి సంబంధించిన తాళిబొట్టు కనిపిం చింది. వెంటనే పోలీసులు క్వారీ గుంతలో వెతకగా ఆదిలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంటనే ఏడుకొండలను విచారించగా అతను తడబడుతుండటంతో పోలీసులు ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆదిలక్ష్మి (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ కే శ్రీనివాసరావు

మారుతీనగర్ ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన ఆదిలక్ష్మి హత్య ప్రదేశాన్ని సోమవారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సందర్శించారు. సమీపంలో నివసిస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.


కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన యడ్లపాడు మండలం బోయపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం.. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన భార్గవి(25)కి యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన వడ్డేపల్లి అశోక్‌తో ఏడేళ్ళ క్రితం వివాహం జరిగింది. అశోక్ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా భార్గవి కూలి పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్గవి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. విషయం తల్లి దుర్గకు తెలుపగా ఉప్పలపాడు ఆర్ఎంపీ వైద్యునితో వైద్యం చేయించి భర్తవద్దకు పంపించింది. అయితే కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లికి ఫోన్‌చేసి నొప్పి భరించలేకున్నాను చనిపోవాలని ఉందంటూ పలు మార్లు చెప్పింది. ఆదివారం సాయంత్రం మరోసారి తీవ్రంగా నొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకుని కుమార్తెను చూసి భోరున విలపించారు. మృతురాలి తల్లి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో 16వ నంబరు జాతీయరహదారి కొత్త బైపాస్ మార్గంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ కుటుంబం ఏపీ 39 ఎస్‌డబ్ల్యూ 1414 నంబరు గల స్కార్పియో వాహనంలో ఆదివారం సాయంత్రం ఒంగోలు వైపు బయలు దేరారు. సుమారు రాత్రి 8.30గంటల సమయంలో తిమ్మాపురం వద్ద కొత్త బైపాస్ మార్గంలోని బ్రిడ్జిపైకి వీరి కారు చేరుకుంది. ఆ సమయంలో గుంటూరు నుంచి కనిగిరికి గృహోపకరణాలు తీసుకుని వెళుతున్న ఏపీ 39 డబ్ల్యూసీ 8067 నంబరు గల టాటా ఏస్ మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి స్కార్పియోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీనితో స్కార్పియో వాహన యజమానికి మినీ ట్రాన్స్‌పోర్టు వాహనం డ్రైవర్ బత్తుల వెంగయ్య(30)ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం మధ్యలో ఒంగోలు సమీపంలోని స్వగ్రామమైన ఎస్ గూడెపల్లెలోని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ప్రమాదం గురించి సమాచారం ఇచ్చాడు. అనంతరం నడ్డిరోడ్డుపై నిలిపి ఉంచిన వాహనం వద్దకు పరుగు తీశాడు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు వెంగయ్యను ఢీకొట్టింది. వెంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనపై తల్లి వీరమ్మ సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహానికి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.

బైకును టాటా మ్యాక్సీ ఢీకొని ఒకరి మృతి




అశోక్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బైకును టాటా మ్యాక్సీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని శిరిగిరిపాడులో చోటుచేసుకుంది. శిరిగిరిపాడు గ్రామానికి చెందిన ఈదర అశోక్‌రెడ్డి (29), బోయ వెంకటరెడ్డిలు సోమవారం ద్విచక్ర వాహనంపై పొలం నుంచి ఇంటికి వస్తున్నారు. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుకగా వచ్చిన టాటామ్యాక్సీ వాహనం బైకును ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అశోక్‌రెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకటరెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచికల్లు రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

రహదారి పనులకెళ్లి శవమై తేలాడు...!



తురకా కోటేశ్వరరావు(ఫైల్)

రెంటచింతల,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కూలీ పనులకెళ్లి సాగర్ కాలువలో జారిపడిన యువకుడు మృతదేహం సోమవారం మంచికల్లు రిజర్వాయర్‌లో లభ్యమైంది. సేకరించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన తురకా శ్రీను,నాగలక్ష్మిల ఏకైక కుమారుడు కోటేశ్వరరావు గురజాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి శనివారం జాతీయ రహదారి పనులకెళ్ళాడు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కూలీలతో కలిసి పనిచేసిన తరువాత ట్యాంకర్‌లో నీటిని నింపే క్రమంలో కాలుజారి బొంబాయి బ్రిడ్జి కుడి కాలువలో పడిపోయాడు. సోమవారం బుగ్గవాగు రిజర్వాయర్‌లో శవమై తేలాడు.

కొలనుకొండ హతురాలు సజ్జా తిరుపతమ్మగా గుర్తింపు



సజ్జా తిరుపతమ్మ (ఫైల్ ఫోటో)

తాడేపల్లి (కొలనుకొండ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద హైవేకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై విగతజీవిగా పడివున్న మహిళను పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మ (35) గా పోలీసులు గుర్తించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలని భర్త మృతి చెందడంతో కుటుంబ పోషణ భారమై క్యాటరింగ్ పనులకు వెళుతుందని సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. ఆదివారం ఉదయం విజయవాడలో క్యాటరింగ్ పనులకు వెళుతున్నానని చెప్పి తిరుపతమ్మ ఇంటి నుంచి వచ్చిందని హతురాలి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అనంతరం హత్యకు గురైన మహిళ విషయం వెలుగులోకి రావడంతో మృతురాలిని గుర్తించామని చెప్పారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారని తెలిపారు. కాగా ఈ విషయమై క్లూస్ టీమ్ సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని పలు వివరాలు సేకరించింది. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. కాగా ఈ హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 520.60 అడుగులు ఉంది. ఇది 150.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 14,711 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,05,783 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,783 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,05,783 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,366 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12000
334	9500	13000	బ్యాడిగి 355	10000	12700
నంబరు. 5	10000	13100	సింజెంటా		
273	--	--	బ్యాడిగి 5531	--	--
341	10000	14000	దేవనూరు డీలక్స్	10200	12500
4884	--	--	ఆర్మూరు	10000	11600
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	7200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10000	13200			

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అనుమతులు లేని నిర్మాణాలపై సిమెంట్ ఫ్యాక్టరీకి నోటీసులు

దాచేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అనధికార నిర్మాణాలు చేపట్టడంతో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు అందజేశారు. తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీ అధికారులు పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడు సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సోమవారం నోటీసులు అందజేశారు. మండలంలోని పెదగార్లపాడు గ్రామం చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీలో అనధికారిక నిర్మాణాల వివరాలు అందజేయాలని, అప్పటివరకు వాటిలో ఎటువంటి కార్యకలాపాలు చేయటానికి వీల్లేదని తెలిపారు. ఏమైనా కార్యకలాపాలు జరిగినట్టు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికార నిర్మాణాలు చేపడుతున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు వివరించారు.

ఎన్‌ఎస్‌పీ డీఈగా ఆదినారాయణ

పిడుగురాళ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఎన్‌ఎస్‌పీ ఇన్‌ఛార్జి డీఈగా దాచేపల్లి ఏఈ పి.ఆదినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల డీఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నీటిసంఘాల అధ్యక్షులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం విడుదల అవుతున్న సాగునీటిని రైతులు సాగుచేస్తున్న పంటలకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చివరిభూములకూ సాగునీరందించేందుకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని డీఈ తెలిపారు.

రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు

దాచేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని ముత్యాలంపాడు రోడ్డులోని రైతు సహకార సంఘం సమీపంలో కొంతమంది వ్యక్తులు రోడ్డును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ముత్యాలంపాడు రోడ్డులోని పిన్నెల్లి డొంకనందు కొంతమంది వ్యక్తులు రోడ్డుకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి ఇవి తమవేనంటూ కాగితాలు చూపిస్తూ నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు, మునిసిపల్ కమిషనర్ అప్పారావుకు ఫిర్యాదు చేసినవారిలో అక్కిన బాలయ్య, కే నాగరాజు, నరసింహారావు, ఆర్ వెంకటేశ్వర్లు, రామానుజాచార్యులు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

26న క్రెడిట్ క్యాంపు

మాచవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీన క్రెడిట్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు సోమవారం తెలిపారు. కాపు, బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలకోసం అర్జీలు పెట్టుకున్న వారందరూ 26న జరిగే క్రెడిట్ క్యాంపుకు తగిన పత్రాలతో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాల బ్యాంక్ మేనేజర్లు పాల్గొంటారన్నారు. ఈబీసీ, కాపు, బీసీ కులాలవారు సబ్సిడీ రుణాల అర్జీలకు ఈనెల 25వ తేదీవరకు గడువు పెంచినట్టు ఎంపీడీవో తెలిపారు. అర్హులైనవారు 25వ తేదీలోపు ఆయా గ్రామాల సచివాలయాల్లో, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ నమోదు కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోవచ్చన్నారు.

పీ 4 సర్వేపై వార్డు సభ

పిడుగురాళ్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి కుటుంబానికి చేయుతగా ఉండేందుకు, ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన పొందే దిశగా పనిచేస్తుందని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన వార్డు సభలో కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ.. పీ4 సర్వేతో ప్రతి కుటుంబ స్థితిగతులు తెలుసుకోవటం జరిగిందని, దిగువ తరగతి కుటుంబాలను ఆర్థికంగా ముందుకు తీసుకొనిపోయే దిశగా ప్రభుత్వం పథకాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, లెక్కల విష్ణు, జమ్మిశెట్టి రామకృష్ణ, రామకృష్ణ, కాశీం సైదా, బిజిలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలపై ఎన్‌జీవో సంఘ నేత హర్షం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.6,200 కోట్లు విడుదల చేయటం పట్ల పిడుగురాళ్ల ఎన్‌జీవో సంఘ అధ్యక్షులు డి.పట్టాభి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐ, సీపీఎస్ వంటి బిల్లులకు, ఉగాది కానుకగా డీఏ ప్రకటించాలని ఏప్రిల్ 1 నుంచి ఐఆర్ త్వరగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్లు పట్టాభి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సెక్రటరీ ఈవీ అప్పారావు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం ప్రారంభం

మాచర్లటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌బిల్లుల వసూలుకేంద్రాన్ని సోమవారం ఆ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ ప్రారంభించారు. విద్యుత్ శాఖ కార్యాలయం మొదటి ఫ్లోర్‌లో విద్యుత్ బిల్లుల కేంద్రం ఉండడంతో దీనిని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ నూతలపాటి సింగయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ భైరం వెంకటేశ్వరరావు, ఏడీఈ అడ్లూరి రామయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏఈ కోటేశ్వరరావు, ఎల్‌ఐ మంత్రునాయక్ పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మున్సిపల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు, నీటి పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ డీ వేణుబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో విద్యుత్‌బకాయిలు సుమారు రూ.4.80కోట్లు ఉన్నాయన్నారు. సింగిల్ టైం పేమెంట్ చేస్తే రూ.74లక్షలు తగ్గిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం నిధులు లేక కట్టలేని పరిస్థితిలో మున్సిపల్ ఆఫీస్ ఉందన్నారు.

కాపర్ వైర్ దొంగలు అరెస్టు

రెంటచింతల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రెంటచింతల, గురజాల మండలాల్లోని పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగెలను దొంగిలించి వివిధ ప్రాంతాల్లో విక్రయించిన ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున చెప్పారు. సోమవారం స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులంతా మాచర్లలోని వినాయకునిగుట్టకు చెందినవారన్నారు. 18 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను దొంగిలించిన వీరు గుంటూరు పరిసర ప్రాంతాల్లో విక్రయించారన్నారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి గురజాలలోని అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.అలేఖ్య ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



పునాదుల్లోనే నిర్మాణం నిలిచిపోయిన పీహెచ్‌సీ భవనం

డాక్టర్లు ఉన్నారు... ఆస్పత్రే లేదు

● జగన్ ప్రభుత్వంలో హడావుడిగా మంజూరు...
● బిల్లులు చెల్లించక ఆగిన పీహెచ్‌సీ భవన నిర్మాణం
● ఇబ్బందులు పడుతున్న ఏడు గ్రామాల ప్రజలు

క్రోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలం దొడ్లేరు పీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది ఉన్నా ఆస్పత్రి మాత్రం లేదు. దొడ్లేరుకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరైంది. 2023 ఆగస్టులో రూ.2.50కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణం ప్రారంభించారు. అంచనా ఐతే రూపొందించారు గాని నిధులు మాత్రం మంజూరుచేయలేదు. హసనాబాద్ రహదారిలో ఉన్న జగనన్న కాలనీ స్థలాల్లో అప్పటి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హడావుడిగా నిర్మాణం చేపట్టారు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయ్యాక బిల్లుల చెల్లింపు జరగకపోవటంతో ఆస్పత్రి నిర్మాణం ఆగిపోయింది. ఆస్పత్రి మంజూరు కాగానే ఇద్దరు క్వాలిఫైడ్ డాక్టర్ల నియామకం జరిందిి. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఇతర సిబ్బంది నియామకాలు కూడా జరిగాయి. అక్కడ ఆస్పత్రి లేకపోవటంతో ప్రస్తుతం వారంతా క్రోసూరు పీహెచ్‌సీలో ఉంటున్నారు. ఆస్పత్రి ఒకచోట, విధుల నిర్వహణ మరోచోట అన్నట్టుగా వారి పరిస్థితి ఉంది. ఆస్పత్రి పరిధిలోకి వచ్చే దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు, హసానాబాద్, నాగవరం, గుడిపాడు, అనంతవరం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి 20వేల జనాభాకు ఒక ఆస్పత్రి నిర్మాణం జరగాలన్న నిబంధన ఉంది. జగన్ ప్రభుత్వంలో మంజూరై 25 శాతం నిర్మాణమైన వాటిని నిలిపివేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 20 శాతమే నిర్మాణం పూర్తిచేసుకున్న దొడ్లేరు పీహెచ్‌సీ భవననిర్మాణం జరుగుతుందా? లేదా? అన్న సందేహం వ్యక్తమవుతోంది.

ఆస్పత్రి లేక ఇబ్బందులు : బి.హనుమంతరావు, దొడ్లేరు

క్రోసూరు మండలంలో దొడ్లేరు రెండో అతి పెద్ద గ్రామంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవటంతో గర్భిణీలు, బాలింతలు, శిశువులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయించాలంటే క్రోసూరు పీహెచ్‌సీకి వెళ్ళాల్సి వస్తుంది.



కేసానుపల్లి 81వ గేటు వద్ద పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీ, తహసీల్దార్ కుటుంబరావు, రైల్వే ఎస్‌ఎస్‌ఈ శ్రీనివాసరావు తదితరులు

కేసానుపల్లి రైల్వేగేటు పరిశీలన

దాచేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నడికూడి రైల్వేజంక్షన్ సమీపంలోని కేసానుపల్లి గ్రామ వద్ద ఉన్న 81వ రైల్వేగేటును రెవెన్యూ, రైల్వే అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. సోమవారం గురజాల ఆర్డీవో మురళీ, తహసీల్దార్ వైవీ కుటుంబరావు, రైల్వే ఇంజనీరింగ్ విభాగం సీనియర్ సెక్షన్ ఇంజనీరు శ్రీనివాసరావులు రైల్వేగేటును పరిశీలించారు. రైల్వేశాఖ పల్నాడు జిల్లాకు మూడు రైల్వే ఆర్‌వోబీలను మంజూరు చేస్తూ గెజిట్ జారీచేసింది. సత్తెనపల్లి-అమరావతి రోడ్డులోని పెదకూరపాడు యార్డు వద్ద ఎల్‌సీ నెం.27, వెన్నాదేవి-కంకణాలపల్లి రోడ్డులోని సత్తెనపల్లి-రెడ్డిగూడెం స్టేషన్‌ల మధ్య ఉన్న ఎల్‌సీ 40, దాచేపల్లి-కేసానుపల్లి రోడ్డులో ఉన్న తుమ్మల చెరువు-నడికూడి స్టేషన్‌ల మధ్యలో ఎల్‌సీ 81 లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్‌వోబీలు మంజూరయ్యాయి. ఆయా గేట్లవద్ద ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో వీటిని మంజూరుచేసింది. ఫ్లైవోర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు. అధికారులు స్థలాన్ని, రైల్వేగేట్లను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది.



జాయింట్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

పీడబ్ల్యూడీ కాలనీలో కొనసాగుతున్న జాయింట్ సర్వే

మాచర్లటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం పీడబ్ల్యూడీ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీల పేరిట చేపట్టిన పట్టాల పంపిణీ పలు వివాదాలకు దారితీయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ, పీడబ్ల్యూడీ, పురపాలక సంఘం అధికారులతో సోమవారం జాయింట్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పది టీంలు ఏర్పాటు చేసి ఒక్కో టీంకు మూడు శాఖల నుంచి ముగ్గురు చొప్పున ఒక్కో టీం సుమారు 30 ఇళ్లకు సంబంధించి సమగ్ర సర్వే చేపట్టామన్నారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌ఐ ఇంటూరి అనిల్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మా భూమి వివరాలు ఆన్‌లైన్ చేయాలి

కారంపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తమ భూమి వివరాలను ఆన్‌లైన్ చేయాలని సోమవారం కారంపూడి గ్రామస్తులు కోరారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్‌కు అర్జీ అందించారు. అలాగే ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరుతూ పలువురు అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థరహిత గ్రామాల సాధనకు కృషి

సత్తెనపల్లి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వ్యర్థరహిత గ్రామాల లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని నందిగామలోని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలు, షెడ్‌మిత్రలకు శానిటేషన్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో ప్రజల భాగస్వామ్యం అవసరం అన్నారు. కార్యక్రమాన్ని ఆరు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, డీపీఆర్సీ డి.నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ ఏ శ్రీనివాసరెడ్డి, ఐటీసీ రిసోర్స్‌పర్సన్ చెంబేటి బొల్లయ్య, బలిజేపల్లి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి ఈనెల 25వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు జరిగే కార్యక్రమంలో ప్రయాణీకులు తమకు ఫోన్‌చేసి సమస్యలు చెప్పడంతోపాటు సలహాలు అందించాలని కోరారు. 99592 25429 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎంపీని విమర్శించటం హాస్యాస్పదం

● నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల



పెదకూరపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లావు శ్రీకృష్ణదేవరాయలును మాజీ మంత్రి విడదల రజిని విమర్శించటం హాస్యాస్పదంగా ఉందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ సోమవారం తెలిపారు. వైసీపీ ప్రభుత్వం బీసీలపై దాడులు చేసినప్పుడు కనీసం నోరు విప్పని రజని, బీసీ మహిళ అని చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. మీ పార్టీ కార్యకర్తల వద్దే డబ్బు తీసుకున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అధికార గర్వంతో అరాచకాలకు పాల్పడ్డది మీరుకాదా? అని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యేలపై అసందర్భ వ్యాఖ్యలుచేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలును విమర్శించే స్థాయి రజనీకి లేదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కారంపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలును విమర్శించేస్థాయి మాజీ మంత్రి విడదల రజనీకి లేదని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో వారు విలేకరులతో మాట్లాడారు. రజనీ చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఎంపీపై నిందలు వేయడం హేయమన్నారు. రజని, ఆమె మరిది గోపి చేసిన తప్పులకు శిక్ష తప్పదన్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడడం నిజం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, గాడిపర్తి పూర్ణయ్య, నాగుర్, కొండ పాల్గొన్నారు.

క్షయవ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



సత్తెనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏరియా వైద్యశాల వైద్యులు, టీబీ యూనిట్ సిబ్బంది

సత్తెనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే దానిని నివారించవచ్చని టీబీ యూనిట్ ఎంవోడీసీ డాక్టర్ అనూషరాణి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ అనూషరాణి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఛాతీలో నొప్పి, జ్వరం రావడం, బరువు తగ్గడం వంటివి క్షయ లక్షణాలు కావచ్చన్నారు. ర్యాలీలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్‌ఎంవో శోభారాణి, డాక్టర్ అనూష, డాక్టర్ అక్కమ్మబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమాదేవి అన్నారు. ప్రాథమిక వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్షయ అంటు వ్యాధని, దగ్గు, తుమ్ములు, ఉమ్మివేయడం ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. అనంతరం వైద్యసిబ్బందితో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

● రాజుపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామ పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి క్షయపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వైద్యుడు రవితేజనాయక్ మాట్లాడుతూ గ్రామాలను క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం సిబ్బంది, గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞచేయించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉషారాణి, స్టాఫ్‌నర్సు సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రమాదేవి పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ



క్రోసూరులో క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ

క్రోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ షాద్, డాక్టర్ సిరిచందన అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్రోసూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి వైద్యాధికారులు మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్, సీహెచ్‌వో సాంబశివరావు, సూపర్‌వైజర్ సౌజన్య, సూరె హైమావతి, శివుడు, ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ ప్రొవైడర్లు, శావర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మాచర్ల రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెస్లీ అన్నారు. మండలంలోని తాళ్లపల్లి ట్రైబల్ ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ శివలీల, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్ నాగేశ్వరరావు, డి.సుధాకర్, సరస్వతిబాయి తదితరులు పాల్గొన్నారు.

31 లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోపు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ డానియేలు తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో ఇంకా 6,408మంది ఈకేవైసీ చేయించుకోవాల్సివుందన్నారు. సమీపంలోని రేషన్‌డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు.

రెంటచింతల మండలంలో...

రెంటచింతల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు, ఇటీవల పిల్లల ఆధార్ అప్‌డేట్ చేసుకున్నవారంతా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్ కోరారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలా చేయిస్తేనే రేషన్‌కార్డులో అందరి సభ్యుల పేర్లు ఉండడంతో పాటు సరుకులు అందే అవకాశం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్‌ఐ పల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ దుర్గేశ్వరరావు కోరారు. ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ నుండి ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే నిత్యావసర సరుకులు అందజేస్తామన్నారు. సంబంధిత రేషన్ డీలర్, వీఆర్వో వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న పట్టుబడ్డ 1.5కేజీల గంజాయి కేసులో ఐదుగురు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ అచ్చయ్య తెలిపారు. స్థానిక అరుడొంకల బావి సమీపంలోని పాతకోళ్లఫారంలో గంజాయిని విక్రయించేందుకు పొట్లాలు తయారుచేస్తుండగా డీఎస్పీ స్పెషల్ టీం, స్థానిక పోలీసులు నిర్వహించిన దాడులలో ఐదుగురు నిందితులు పరారయ్యారు. వారిలో ఎన్ తారక్‌ని గుంటూరు రోడ్‌లోని ఆర్చి వద్ద సీఐ సిబ్బందితో పట్టుకుని సత్తెనపల్లి కోర్టులో హాజరుపర్చారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసంపూర్తి గృహాలకు ఆర్థిక సహాయం

పెదకూరపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అసంపూర్తి గృహాలకు అదనపు ఆర్థిక సాయాన్ని గృహనిర్మాణ శాఖ విడతల వారీగా ఇవ్వనుందని ఆ శాఖ ఏఈ మాటూరి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 2019-24 మధ్యకాలంలో అసంపూర్తిగా నిర్మించుకున్న గృహాలకు ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, అత్యంత వెనుకబడిన గిరిజనులకు రూ.లక్ష ప్రభుత్వం అందించనున్నట్టు తెలిపారు. మండలంలో 625 గృహాలు నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

అచ్చంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని సంపద సృష్టి కేంద్రంలో ఘన వ్యర్థాల నిర్వహణపై మండలంలోని గ్రామ కార్యదర్శులకు, షెడ్డు మిత్రలు, క్లాప్ మిత్రలకు రెండురోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. సర్పంచ్ ఎస్‌కే జానీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణలో 40మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో తడి, పొడి చెత్త, ప్రమాదకర చెత్తలను సేకరించే విధానం వంటి వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పీఎస్‌ఎన్ ప్రసాదరావు, ఎంఆర్‌పీ ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

● క్రోసూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని డంపింగ్ యార్డులో సోమవారం ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఏడు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా తడి, పొడి వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాలను ఇంధనంగా మార్చటం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ శ్రీనివాసరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్స్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ ప్రజావేదికలో సత్తెనపల్లి పట్టణ, మండల, బూత్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వకార్డుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో కన్నా మాట్లాడుతూ నాయకులు కుటుంబ సాధికారిక సారథులను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రతి 60మంది ఓటర్లకు ఒక సారథి ఉంటారన్నారు. ఈ సారథులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బోలపేతంలో వీరి పాత్ర ఎంతో ఉంటుందన్నారు. పట్టణ, మండల నాయకులు కూడా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సభ్యత్వ కార్డులను కన్నా, నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, కంభాల వెంకటేశ్వరరావు, మన్నవ శారదాదేవి, గొర్రెపాటి సుశీల, కోమటినేని శ్రీనివాసరావు, పోట్ల అంజనేయులు, గుంటూరు మల్లేశ్వరి, జానీ ఖాజావలి, పచ్చా సుధీర్, అన్నదాసు వెంకట్రామయ్య, సోలా నంది, చిలకా శ్యామ్, జాకీరు, పి.హనుమంతరావు, ఏ నాగేశ్వరరావు, కె.రమేష్, బచ్చేబాబు, బి.సుబ్బారావు, అండాలు, పి.హరేకృష్ణ, సాంబశివరావు పాల్గొన్నారు.

27న రంజాన్ తోఫా పోస్టర్ల ఆవిష్కరణ

ఈనెల 27వ తేదీన పట్టణ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో జరిగే రంజాన్ తోఫా పోస్టర్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం తన కార్యాలయంలో ముస్లిం మైనార్టీల నేతలతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ పెద కరిముల్లా, రాంబో బుడే, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, బచ్చే బాబు, అబ్దుల్ గౌస్, దూత్‌కే తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ నరసింహారావు పర్యటన

మాచర్లటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించారు. 13,14,15 వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

11వ తేదీ లోగా కేజీబీవీలకు దరఖాస్తు చేసుకోవాలి

నకరికల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను, అలాగే ఇంటర్ సెకండియర్‌లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

మిట్టగుడిపాడు కేజీబీవీలో..

రెంటచింతల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మిట్టగుడిపాడు గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు స్పెషలాఫీసర్ బాలినేని రాజకుమారి చెప్పారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనాథలు, పాక్షిక అనాథలు, బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు అర్హులన్నారు. ఇంటర్ బైపీసీ, 6వ తరగతిలో 40 సీట్ల చొప్పున ఉండగా 7,8,9,10, ఇంటర్ సెకండియర్‌లో ఖాళీగా వున్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాగా చదివితే మంచి భవిష్యత్: మంత్రి పార్థసారధి

బెల్లంకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సోమవారం బెల్లంకొండ మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు మల్బార్ గోల్డ్ అండ్ డైమండ్, మల్బార్ గోల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ సంస్థ ద్వారా మెరిట్ సాధించగా స్కాలర్‌షిప్‌లను ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న మెరిట్ విద్యార్థులకు మల్బార్ గోల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి, ఉపాధ్యాయులు, ట్రస్ట్ అధినేతలు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి నీటి సమస్య లేకుండా చేస్తాం

● మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి

బెల్లంకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీకి మంచినీటి సమస్య లేకుండా చేస్తామని బెల్లంకొండ మండల కోర్ కమిటీ సభ్యుడు, టీడీపీ నాయకుడు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నాగిరెడ్డిపాలెం కాలనీ వాసులు ఎస్సీ కాలనీలో మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సీతారామిరెడ్డి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన సోమవారం ఎస్సీ కాలనీలో బోరు వేయించారు. వెంటనే విద్యుత్ మోటారును ఏర్పాటుచేసి కాలనీకి నీటి సమస్య లేకుండా చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

నకరికల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపుసంఖ్యను పొందాలని ఏవో దేవదాసు కోరారు. సోమవారం గుండ్లపల్లి గ్రామంలో రైతువిశిష్ట సంఖ్యతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సంక్షేమ పథకాలు పొందటానికి విశిష్ట గుర్తింపుసంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎం ప్రసన్నకుమార్, ఎం సాధ్యారాణి, షేక్ సైదా, మోషే, అహమ్మద్ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

● జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు

మాచర్ల రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే తమ ధ్యేయమని జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మండలంలోని అనుపు కృష్ణా జలాశయంలో సోమవారం 10 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా చేపపిల్లల విడుదల చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో జగదీష్, మత్స్యశాఖ తనిఖీ అధికారి వెంకటరమణ, గ్రామ మత్స్య సహాయకులు లీలావతి, టీడీపీ నేత ఆడెపు కోటయ్య, మత్స్యకారుల సంఘం ఉపాధ్యక్షుడు నరసింహులు, సీహెచ్ అప్పలరాజు, ఓసుపల్లి రాజారావు, రామ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలను విడుదల చేస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు తదితరులు

- శాఖమూరులో 300 ఎకరాల్లో ఏర్పాటు
- పార్కు మధ్య భారీ జలాశయం
- చుట్టూ పార్కులు, వినోద కేంద్రాలు
- హైలెట్‌గా వైల్డర్‌నెస్ పార్కు
- ఇప్పటికే ఆరంభమైన పనులు

అమరావతికే ప్రత్యేకాకర్షణ సెంట్రల్ పార్కు



(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణమూ ఓ ప్రత్యేకతతో కూడుకున్నదే! ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి పట్టుదలతో ఆవిర్భవిస్తున్న అమరావతి నగరం...మరికొద్ది కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్లూగ్రీన్ ఫీల్డ్ నగరంగా రూపుదిద్దుకోనుంది. ఈ నగరంలో ప్రతీది కళాత్మకంగాను పర్యావరణ వ్యూహానికి పునాదిగాను వుండబోతుంది. నగరంలో 60శాతం ప్రాంతం పచ్చదనం, నీటితో ఆక్రమించబడినట్టు కనిపిస్తూ చాల అద్భుతంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ముఖ్యంగా గవర్నమెంట్ కోర్‌గా పిలువబడే ప్రాంతం 5.5 కిలోమీటర్లు / 1 కిలోమీటరు నిడివిలో న్యూయర్క్ సెంట్రల్ పార్కు స్ఫూర్తిగా దర్శనమివ్వబోతుంది. సరిగ్గా ఈ ప్రభుత్వ భవనసముదాయ ప్రాంగణానికి దిగువగా కనిపించే ప్రాంతంలో రాజధానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా సెంట్రల్ పార్కు నిర్మాణాన్ని చేపడుతున్నారు. నిజానికి అమరావతిలో దీనిని ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా భావిస్తున్నారు. ఈ పార్కు నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ పార్కు రాజధాని అమరావతికే కాదు...దక్షిణ భారతదేశంలోనే ఓ గొప్ప పర్యాటకకేంద్రంగా రూపుదిద్దుకోబోతుంది.


అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ సెంట్రల్ పార్కును నిర్మిస్తున్నారు. ఇది రాజధాని ఏరియాలోని ప్రభుత్వ భవన సముదాయానికి దిగువన అంటే శాఖమూరు పరిధిలో ఏర్పాటవుతోంది. మొత్తం 300 ఎకరాలకు గాను మధ్యలో 50.69 ఎకరాల విస్తీర్ణంలో ఓ సుందరమైన జలాశయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. అనంతరవం కొండల నుంచి వచ్చే వరదజలాలను ఈ జలాశయానికి మళ్లిస్తారు. అంటే ఈ జలాశయాన్ని వరద నివారణ చర్యలతోపాటు ఆహ్లాదకరంగాను, పర్యాటకంగాను వుండేలా వినియోగించుకోబోతున్నారన్నమాట! .మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యాక ఈ జలాశయంలో బోటింగ్‌కు కూడ అనుమతిస్తారు. ఇందుకోసం జలాశయానికి ఓవైపుగా ఎకరం విస్తీర్ణంలో బోటింగ్ అండ్ వాటర్ స్పోర్ట్స్ జోన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం చుట్టూ సందర్శకులను ఆకట్టుకునేలా వేర్వేరు సాంస్కృతిక, పర్యాటక ఆహ్లాదకర కేంద్రాలను విభిన్నంగా ఏర్పాటు చేస్తారు. జలాశయానికి ఉత్తరంగా పుష్పక్ పేరుతో 23 ఎకరాల విస్తీర్ణంలో ఫ్లవర్ గార్డెన్‌ను ఏర్పాటుచేస్తారు. దీని పక్కనే ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ఏరియా పేరుతో 18.8 ఎకరాల ఖాళీ స్థలాన్ని వుంచుతున్నారు. దానిపక్కనే 30.07 ఎకరాల విస్తీర్ణంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కును , దానికి కొంచెం పై ఎత్తులో వుండేవిధంగా 7.42 ఎకరాలలో క్రాఫ్ట్ బజారును ఏర్పాటుచేస్తారు. జలాశయానికి తూర్పు మధ్యస్థంగా ఎడ్వంచర్ పార్కు (పిల్లల సాహస ఉద్యానవనం)ను 15 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్నారు. దాని పక్కనే మరో 20 ఎకరాల విస్తీర్ణంలో చాల ప్రత్యేకమైన రీతిలో వైల్డర్‌నెస్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు అడవి అనుభవాన్ని అందించేవిధంగా దీనిని చాల ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అంటే ఇందులో ఫారెస్ట్ థీమ్ సెటప్‌తోపాటు బర్డ్ పార్కు, రైన్ ఫారెస్ట్ కేఫ్, టెంటెడ్ కాటేజీలు, టెంటెడ్ క్యాంపులు, ఫారెస్ట్ రెస్టారెంట్‌ల వంటివాటిని ఏర్పాటుచేస్తారు. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా ఈ వైల్డర్‌నెస్ పార్కు చాల అద్భుతంగా ఏర్పాటుకాబోతుంది. ఈ పార్కులో చాల విలువైన వృక్షాలను కూడ ఏర్పాటుచేస్తారు. ముఖ్యంగా పురాతన మూలికా మొక్కలతోపాటు మహాశివునికి ప్రీతిపాత్రమైందిగా భావించే మహాబిల్వ తోపాటు రుద్రాక్ష మొక్కలను కూడ ఇందులో ఏర్పాటుచేస్తారు. అవసరాన్ని బట్టి ట్రాన్స్ లొకేట్ పద్ధతిలో ఈ చెట్లను పార్కులోనికి తరలించాలనే ఆలోచన చేస్తున్నారు.. జలాశయానికి పశ్చిమంగా 18.8 ఎకరాల విస్తీర్ణంలో ఏడీసీఎల్ వారి ఆధ్వర్యంలో ఓ నర్సరీని ఏర్పాటుచేస్తారు. దీనికి సమీపంలో 4.25 ఎకరాలలో స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్‌ను, మరో పదెకరాలలో ఎకోపార్కును ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం పార్కుకు నైరుతీదశలో పార్కు నిర్వహణ బాధ్యతలను చూసేందుకుగాను ఏడీసీఎల్ వారి పాలనా భవనాన్ని 1.57 ఎకరాలలో నిర్మిస్తారు. దీనికి చేరువలో అంటే దక్షిణంలో మూడు నక్షత్రాల హోదాగల రిసార్టులను 3.05 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబోతున్నారు.

ఇవికాకుండా పార్కులో మూడు వేర్వేరు ప్రాంతాలలో ఒక్కోటి రెండేసి ఎకరాల విస్తీర్ణంలో వుండేలా మొత్తం మూడు పార్కింగ్ ఏరియాలను ఏర్పాటుచేస్తారు. పార్కులో ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా 25 మీటర్ల వెడల్పుకలిగిన రహదారులు వుంటాయి. వీటితోపాటు షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఫుడ్‌కోర్టులతో కూడిన రెండు కుటుంబ వినోదకేంద్రాలు, వినోద ఉద్యానవనం, యాంఫీ థియేటర్లు, మ్యూజికల్ ఫౌంటేన్ అండ్ లేజర్ షోలను కూడ ఏర్పాటు చేస్తారు. వేయి చదరపు గజాలలో పార్కు చుట్టూ తిరగడానికి పర్యావరణ అనుకూలమైన ట్రాకెలెస్ టాయ్ ట్రైన్‌ను కూడ సందర్శకులకు అందుబాటులో వుంచుతారు. మొత్తంమీద రాజధాని అమరావతికి ఈ పార్కు ఓ పెద్ద ఎస్సెట్‌లా వుండబోతుంది. అమరావతి ఖ్యాతిని దశదిశలా పెంచేలా దీనిని నిర్మిస్తున్నారు. ఈ పార్కుద్వారా పర్యావరణహిత పర్యాటకాభివృద్ధి, ముఖ్యంగా విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని నిర్మిస్తున్నారు.

ఈ మొత్తం సెంట్రల్‌పార్కులో మధ్య 50.69 ఎకరాలు జలాశయానికి పోగా, దాని చుట్టూ వివిధ రకాల పార్కులను 93.65 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కింద ఏర్పాటు చేస్తున్నారు. మరో 107.79 ఎకరాల్లో రిసార్టులు, మూడు, అయిదు నక్షత్రాల హోటళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, కుటుంబ వినోదకేంద్రాలను ఏడీసీఎల్ ఏర్పాటుచేస్తుంది. ఈ సెంట్రల్‌పార్కు అభివృద్ధి పనులను ప్రస్తుతం ప్రగతి గ్రీన్ రిస్పార్ట్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. శాఖమూరులో ఏర్పాటవుతున్న ఈ సెంట్రల్‌పార్కుతోపాటు మల్కాపురం వద్ద 21 ఎకరాలలోను, అనంతవరం వద్ద 35 ఎకరాల్లోను మరో రెండు పార్కులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. ఈ పార్కులోనే స్వర్గీయ పొట్టి శ్రీరాములు స్మారకవనాన్ని కూడ ఏర్పాటుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తుంది.



పార్కు మధ్యలో ఏర్పాటవుతున్న జలాశయం



శాఖమూరులో ఏర్పాటవుతున్న సెంట్రల్ పార్కు తాలూకు మాస్టర్‌ప్లాన్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

గుంటూరు(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 8 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు 753 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాస రావు, సురేష్‌బాబు అభినందించారు.

29 నుంచి తెనాలిలో జాతీయ ఎడ్ల బలప్రదర్శన

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జాతీయ ఎడ్లబల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో ఏర్పాట్లను ఆయన పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేలా ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన ఎడ్లజతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఇదే ప్రాంగణంలో పశుపాల పోటీలు, పశువుల అందాల పోటీలు సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యవసాయంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకునేలా అవగాహన, సాంకేతిక పరిజ్ఞానంతో హార్టికల్చర్, అగ్రికల్చర్‌లో వచ్చిన యంత్రాల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షణలో 18కమిటీలు పనిచేస్తు వివరించారు. సుమారుగా 125 నుంచి 150 జతల వరకు పోటీల్లో పాల్గొననున్నట్లు తెలియజేశారు. పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ప్రముఖులు పాల్గొంటారని కుల,మత,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతుకు ప్లాటు కేటాయిస్తున్న అధికారులు

విజయవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కార్యాలయంలో సోమవారం ఈ-లాటరీ విధానం ద్వారా గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూమి లిచ్చిన 99 మంది రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 147 నివాస ప్లాట్లు కాగా, 80 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డీవో) బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఎన్.ఎస్.వి.బి వసంత నాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించటానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను చేరవేయటంలో కేవీకేలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీ రమణ

లాంఫాం(తాడికొండ)మార్చి 24(ఆంధ్రజ్యోతి): పరి శోధనల్లో రూపుదిద్దుకున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవి ద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ పేర్కొ న్నారు. సోమవారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రం లో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ రమణ ఈ సందర్భంగా మాట్లాడారు. పాడి రైతులకు వ్యవసాయంలో కావాల్సిన సలహాలు, సూచనలు ఎప్ప టికప్పుడు కేవీకే శాస్త్రవేత్తలు ఇస్తున్నారన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కేవీకేల ద్వారా అనేక సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించే క్రమంలో అంతరాలను గుర్తించి వాటిని పూరించటానికి కేవీకే పనితీరు మెరుగుపరచడానికి ఎంతో కీలకమైనవని తెలిపారు. అనంతరం 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025-26 కార్యచరణ ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బీ.రేఖామణి, లాంఫాం కేవీకే అధినేత డాక్టర్ ఎం.యుగంధర్, డాక్టర్ శివనారాయణ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వో.నరసింహారావు, ఎల్‌ఆర్‌ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దీపా పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్ల నిధుల విడుదల

తెనాలి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు విడుదల చేశారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో క్లష్టర్‌కు ఒక స్కూల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒక రోజు ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించి శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.లక్ష కేటాయించారు. వీటిల్లో సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయుల ట్రావెలింగ్ అలవెన్స్ కింద రూ.10 వేలు, నిర్వహణ కింద రూ.30 వేలు, కంటిమ్‌జెన్సీ గ్రాంట్ రూ.35 వేలు, బోధన ఉపకరణాలకు రూ.25 వేలు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను కేటాయించిన నిధులను సద్వినియోగం చేసి బిల్లులు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2809 క్లష్టర్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాకు రూ.64 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.79 లక్షలు, పల్నాడు జిల్లాకు 107 లక్షలు విడుదల అయ్యాయి.

అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్‌పై వేటు


వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని అచ్చంపేట సీఐ కే వెంకట ప్రసాద్‌పై వేటుపడింది. ఆయనను వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఎస్‌ఐగా పల్నాడుతో పాటు జిల్లాలోని పలు స్టేషన్లలో విధులు నిర్వహించారు. సీఐగా ఉద్యోగోన్నతి పొందిన తరు వాత గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌లో గత ఎన్నికల సమయంలో విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెంకటప్రసాద్‌ను అచ్చంపేట సీఐగా నియమించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులకు సహకరించకపోగా ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అపవాదు మూటగట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రంధసిరి గ్రామానికి సంబంధించిన వైసీపీ నాయకుడిపై నమోదైన కేసులో ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఆ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ అతన్ని వదిలి వేశాడు. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడం తో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయితే సీఐకు తెలియకుండా వైసీపీ నాయకుడిని వదిలిపెట్టి ఉండరనే ఆరోపణలు వచ్చాయి. సుమారు ఐదారు నెలల క్రితం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన అనంతరం కూడా సీఐ వెంకట ప్రసాద్‌లో మార్పు రాలేదు. ప్రతిపక్ష వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. మరోవైపు పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయడంలోనూ విఫలమవుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన పనితీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని నిఘవర్గాలు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో వెంకటప్రసాద్‌ను వీఆర్‌కు పంపుతూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎయిర్ ట్యాక్సీ @ గుంటూరు

అత్యాధునిక ప్రయాణ సాధనాన్ని ఆవిష్కరించిన ఆంధ్రా కుర్రోడు



గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ట్యాక్సీ పేరుతో అధునాతన గగన రవాణాకు ఉపకరించే ప్రయాణ సాధనం గుంటూరులో రూపుదిద్దుకుంటుంది. ఇప్పటివరకు ప్రపంచంలో కేవలం చైనాకు మాత్రమే పరిమి తమైన అధునాతన రవాణా వ్యవస్థను గుంటూరుకు చెం దిన యువ రోబోటిక్స్ ఇంజినీర్ అభిరామ్ చావా పరిచయం చేస్తున్నాడు. ప్రయోగాలు అన్నీ పూర్తి చేసుకుని కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నాడు. అభిరామ్ అమెరికాలో రోబోటిక్స్ ఇంజినీరింగ్ పీజీ పూర్తి చేశాడు. ఆయనలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని గుర్తించిన అమెరికా, చైనా లోని పేరొందిన సంస్థలు ఎక్కువ మొత్తం జీతంతో ఉద్యోగాన్ని ఇచ్చేందుకు ఆసక్తి చూపించాయి. నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి సేవ చేసేందుకు మాత్రమే వినియోగించాలని సంకల్పించిన అభిరామ్ 2017లో గుంటూరుకు వచ్చేశారు.

మ్యాగ్నం వింగ్స్‌కు అంకురార్పణ

గుంటూరు ఏటుకూరు రోడ్డులో మ్యాగ్నం వింగ్స్ అనే సంస్థలో వీ-2 పేరుతో ఎయిర్ ట్యాక్సీ తయారీకి ఉపక్రమించారు. ఎయిర్ ట్యాక్సీ తయారీకి వినియోగించే ప్రతి వస్తువును స్వయంగా తయారు చేశారు. రెండు, మూడేళ్ల శ్రమ తర్వాత వీ-2 ప్రయోగానికి సంపూర్ణంగా సిద్ధమైంది. ప్రయోగం పూర్తిగా సఫలం కావడంతో ఎక్స్-4 పేరుతో ఎయిర్ క్రాఫ్ట్ తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం అది ప్రయోగానికి సిద్ధమవుతుంది.

ప్రయాణం ఇక సులువు..

అభిరామ్ తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ వినియోగం ద్వారా ప్రయాణం సులువు అవుతుంది. ఉదాహరణకు గన్న వరం విమానాశ్రయం నుంచి విజయవాడకి వచ్చేందుకు ట్రాఫిక్ అవాంతరాలు ఎదురవుతాయి. అదే ఎయిర్ ట్యాక్సీలో ఆ సమస్య ఉండదు. ఉదాహరణకు రోడ్డు మార్గం ద్వారా 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి గమ్యస్థానం చేరుకుంటే, ఎయిర్ ట్యాక్సీలో కేవలం 10 కిలోమీటర్లు ప్రయాణించి గమ్యస్థానం చేరవచ్చు. వీ-2 భూమి నుంచి 1100 అడుగులో 100 కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. ఎక్స్- 4 మాత్రం భూమి నుంచి రెండు వేల అడుగుల దూరంలో 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అభిరామ్ తయారు చేసిన రెండు అత్యధునాతన ప్రయాణ సాధనాలు అటానమస్ సిస్టం(స్వయం నియంత్రణ) విధానంలోనే పనిచేస్తాయి. ప్రో మొబిలిటీ కాన్సెప్ట్ (సంభావ్యత)తో రూపొందించారు. రెండు వాహనాలు బ్యాటరీతో పనిచేస్తాయి. ఎక్స్- 4ను ఇంధనంతో కూడా నడపవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్ క్రాఫ్ట్ ను అంబులెన్స్‌గా వినియోగించవచ్చు.

క్యాబ్ ఖర్చుతో అందుబాటులోకి..

చూడటానికి విమానం, హెలికాప్టర్‌లా ఉండే ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణ ఖర్చు కూడా తక్కువే. క్యాబ్‌కు అయ్యే ప్రయాణ ఖర్చు మాత్రమే అవుతుంది. వీ-2, ఎక్స్- 4 కొనుగోలు ఖర్చు మాత్రం రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్టు అభిరామ్ తెలిపారు. అది చట్టం రూపేణా అమల్లోకి రావడానికి ఏడాది పడుతుందని తెలిపారు. మొదట్లో పైలెట్ లేకుండా ప్రయాణించే విధంగా తయారు చేశామని తెలిపారు. ప్రభుత్వం అందుకు అనుమతి ఇస్తుందో లేదో చూడాలన్నారు. భూమి మీద నుంచి గగనతలంలో వెళ్లే ఈ వాహనాలను నియంత్రించవచ్చని తెలిపారు. డాబాపై ల్యాండింగ్ చేయవచ్చన్నారు. టేకాఫ్, ల్యాండింగ్ రోడ్డుపై చేసేలా తయారు చేశామని తెలిపారు.



అభిరామ్ చావా తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ

దేశానికి వినియోగపడితే చాలు..

నేను చదివిన చదువు ఈ దేశానికి మొదట ఉపయోగపడాలి. ఆ ఉద్దేశంతోనే ఇక్కడకు వచ్చి వీ-2 వాహనం తయారు చేశాను. ఎక్స్- 4 కూడా రెండు, మూడు నెలల్లో ప్రయోగిస్తాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే రోజుకు ఒకటి తయారు చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని సంప్రదింపులు జరుతున్నాయి.

అభిరామ్ చావా,మ్యాగ్నం వింగ్స్ అధినేత

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

11 మంది జూదరుల అరెస్టు... రూ.28,200 నగదు స్వాధీనం

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తుర్లపాడు గ్రామ పరిధిలోని పొలాల్లోని పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్లపాడు గ్రామ పరిధిలోని పొలాల్లో పేకాడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడులలో పేకాట స్థావరంలో పేకాడుతున్న 11మందిని అదుపులోకి తీసుకొనడంతోపాటు వారి వద్ద నుంచి రూ.28,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదరులపై కేసులు నమోదు చేశామని, మంగళవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నరసరావుపేట మార్గంలో కోమటినేనివారిపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వెంపరాల శివరామకృష్ణ కోటేశ్వరరావు (30) తీవ్రంగా గాయపడ్డాడు. అతడు పొలం పనులు పూర్తిచేసుకుని గ్రామానికి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా చిలకలూరిపేట వైపు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొని అతడి తలకు గాయమైంది. వెంటనే అతడిని నరసరావుపేట జీజీహెచ్ ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. తండ్రి వెంకట శివయ్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

200 మంది పేదలకు బియ్యం పంపిణీ

చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా పట్టణంలోని గుర్రాల చావిడి ప్రాంతంలో హుడా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్ ఖాన్ ఆధ్వర్యంలో సుమారు 200మంది పేదలకు, వితంతువులకు సోమవారం బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సయ్యద్ జబీర్, ముఫ్తీ అనస్ ఖాన్ నిద్ర, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో రెండు ఫిర్యాదులు

రొంపిచర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ జి రమేష్ కుమార్ తెలిపారు.

28న రుణ మేళ

రొంపిచర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 28వ తేదీన రుణ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే మాధ్యూరాజు సోమవారం తెలిపారు. వివిధ రకాల కార్పొరేషన్‌లకు సంబంధించి బ్యాంక్ అధికారులు రుణ మేళాలో పాల్గొంటారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సరైన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. రుణమేళాలో ఎంపికైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలందుతాయన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: జేపీవో శ్రీలక్ష్మి

శావల్యాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణ ద్వారా కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జేపీవో శ్రీలక్ష్మి సోమవారం పిలుపునిచ్చారు. ఆమె మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, బిటెక్, డిప్లమా, పాలిటెక్నిక్, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు ప్రభుత్వం రూపొందించిన లింక్, క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 7288059665 నంబరుని కాలని కోరారు.

ఏఎన్‌యూ బేస్‌బాల్ జట్టుకు వినుకొండ విద్యార్థి ఎంపిక



బోధనం శ్రీను

వినుకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న బోధనం శ్రీను అంతర విశ్వవిద్యాలయాల ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బేస్‌బాల్ పోటీలకు నాగార్జున విశ్వవిద్యాలయం తరఫున యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో పోదవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అంతర్ కళాశాల బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ చూపి యూనివర్సిటీ స్థాయి జట్టుకు ఎంపికయ్యాడు. శ్రీనును కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ఎం.జగదీష్, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరావుతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఘనంగా గోవిందమాంబ ఆరాధనోత్సవం

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామపురంలో ఉన్న వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ ఆరాధన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన లక్ష్మీగణపతి యజ్ఞంలో 12మంది దంపతులు కూర్చొని కార్యక్రమం చేశారు. తదుపరి పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఓబిలి రాజేంద్రప్రసాద్, కునిశెట్టి మురళి, పొత్తూరి వరప్రసాద్, పెనుగొండ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చెరువుల వద్ద కొత్త మోటార్లను ప్రారంభిస్తున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణాభివృద్ధికి మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లు మంజూరు చేసిందని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన తాగునీటి చెరువులను ఆయన సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం చెరువుల వద్ద స్థానిక మున్సిపాలిటీ వారు రూ.40 లక్షలతో కొత్తగా కొనుగోలు చేసిన రెండు 100 హెచ్‌పీ మోటార్లను ఆయన ప్రారంభించారు. వీటిద్వారా సాగర్ కాల్వ నుంచి నీటిని చెరువుల్లోకి తోడిపోస్తారని, అదే మోటార్లతో ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన ఈ మోటార్లను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజలకు నిత్యం తాగునీరు అందించేలా పనులు ప్రారంభించామని, 2058 వరకు తాగునీటి సమస్య లేకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో అమృత్ పథకం కింద అర్ధాంతరంగా ప్రారంభించిన తాగునీటి పైపులైన్ల పనులు పట్టణవ్యాప్తంగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక, ఆసంపూర్తి పనులన్నీ పూర్తిచేసి, ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టామన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు కూడా చాలావరకు పూర్తయ్యాయని, మునిసిపల్ కమిషనర్, అధికారుల సమిష్టి కృషితోనే అనుకున్న విధంగా పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మునిసిపల్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రతిపాదనల మేరకు త్వరలోనే పట్టణంలో ప్రజలు కోరిన విధంగా వివిధ అభివృద్ధి పనుల్ని ప్రారంభిస్తామన్నారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు వంటి ప్రాథమిక అవసరాలపై ప్రజల్లో అసంతృప్తికి చోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ రహీం, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, వైస్‌చైర్మన్ గోల్డ్ శ్రీను, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి పాల్గొన్నారు.

పేదలకు చేయూతనివ్వాలి

చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల ఆర్థిక పరిపుష్టికోసమే కూటమి ప్రభుత్వం పీ-4 విధానాన్ని శ్రీకారం చుట్టిందని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 36, 37 వార్డులలో ఆదివారం, కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన పీ-4 విధి విధానాలకు సంబంధించిన వార్డు సభలలో ఆయన పాల్గొన్నారు. సంపాదనాపరులైన ధనికులు, విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు ఉగాది నాడు ప్రారంభించబోయే వినూత్న విధానం పీ-4లో భాగస్వాములై పేద, మధ్యతరగతివర్గాలకు విద్య, వైద్యం, ఉపాధిపరంగా చేయూత అందించాలని కోరారు. పీ-4 లబ్ధిదారుల కుటుంబాలు ఎంపికను స్వయంగా పరిశీలించారు. ప్రతి కౌన్సిలర్ తమ తమ వార్డుల్లోని పేద కుటుంబాల పూర్తి సమాచారం సేకరించాలని, ఆ వివరాలను, ఆయా కుటుంబాల స్థితిగతులను అదే వార్డులలో ఉండే ధనికులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక బాధ్యత ఉన్నవారికి తెలియచేసి, వారి సహాయ సహకారాలు పేద కుటుంబాలకు అందేలా చూడాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయి నుంచే ఈ చేయూత ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం జరగాలన్నారు. సంపాదనాపరులైన పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు, ధనికులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీని బాధ్యతగా భావించి, రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రత్తిపాటి కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, వైస్‌చైర్మన్ గోల్డ్ శ్రీను, కౌన్సిలరు రాయని హరిత, పి.శివకుమారి పాల్గొన్నారు.

టీబీ డే సందర్భంగా మానవహారం

వినుకొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యసిబ్బంది హస్పిటల్ ఆవరణలో సోమవారం మానవహారం నిర్వహించారు. టీబీ డే సందర్భంగా పీపీ యూనిట్ ఎంవోటీసీ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ప్రజలు క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రజాక్, సుధారాణి, ఎన్‌టీ సుశీల, రాజేశ్వరిలతో పాటు ఎన్‌టీపీ యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

● ఈపూరు: ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ర్యాలీ సోమవారం నిర్వహించారు. ర్యాలీలో వైద్యాధికారులు హేమంత, సునీత, నిఖిత, ల్యాబ్ టెక్నీషియన్ ఐశ్రీనివాసాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

● శావల్యాపురం: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యసిబ్బంది శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సెంటర్ వరకు సోమవారం ర్యాలీని నిర్వహించి క్షయవ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రావిపాటి రమ్య, సూపర్‌వైజర్ ఏడుకొండలు, ల్యాబ్ టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్, స్టాఫ్‌నర్స్ ప్రమీల, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ఈపూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రంలో సోమవారం ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, సర్పంచ్ పల్లమిపోలు వెంకయ్య, ఈవోపీఆర్‌డీ ఎన్.రత్నం,సెక్రటరీ రమేష్, పారిశుధ్య సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల బొడ్డు రాయి సమీపంలోని ఘన వ్యర్థాల షెడ్డులో సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ జరిగింది. సర్పంచ్ జయమ్మ, ఎంపీడీవో మాధ్యూరాజు, ఈవోపీఆర్‌డీ సతీష్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తిరునాళ్ల ఏర్పాట్లపై తహసీల్దార్ సుజాత సమీక్ష

బొందిలిపాలెం (శావల్యాపురం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కానంపూడి శివారు బొందిలిపాలెంలో ఈ నెల 30వ తేదీన జరుగనున్న శ్రీఆదినారాయణస్వామి తిరునాళ్లను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తహసీల్దార్ కె.సుజాత అన్నారు. బొందిలిపాలెంలోని దేవాలయంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు పాల్గొని పలు సూచనలు చేశారు.

ఎగ్జామ్ సెంటర్లకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటు: డీఎం

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ నిర్వహించే పాలిటెక్నిక్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జామ్ సందర్భంగా నరసరావుపేటలో పరీక్షా కేంద్రాలకు విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేశామని డీఎం ఎం.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు, 8.15 గంటలకు పరీక్షా కేంద్రం నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు రెండు బస్సులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి నడుపుతామన్నారు. అదే విధంగా తిరుమల ఇంజనీరింగ్ కళాశాల, ఎఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు బస్సులు తిరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న యూసఫ్ అలీ

పేద ముస్లింలకు రూ.7.5 లక్షలు సాయం

చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా లక్కీ రోడ్ లైన్స్ అధినేత మొహమ్మద్ యూసఫ్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ఇస్లాం సంప్రదాయం ప్రకారం జకాత్ సొత్తుతో 700 మంది నిరుపేద కుటుంబాలకు దుస్తులు, 200మందికి ఆర్థిక సాయం, పేద ముస్లిం యువతులకు వివాహానికి, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలుగా మొత్తం సుమారు రూ.7.5లక్షలు అందచేశారు. కార్యక్రమంలో యూసఫ్ కుటుంబ సభ్యులు మొహమ్మద్ కరీమా, అబ్దుల్ బాసిత్, ఒయాసిస్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, కార్యదర్శి కరణం విజయ, మునిసిపల్ డీఈ అబ్దుల్ రహీమ్, కాటన్ రహమాన్, నజీర్ అహమ్మద్, లక్కీ రోడ్ లైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మోసంపై ఎస్పీకి ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. వినుకొండకు చెందిన బీముని వెంకట్రావు తనకుమారుడైన చింత దానయ్యకు ఉద్యోగం ఇప్పిస్తానని 20 లక్షల రూపాయలు తీసుకొని వసంతరావునాయక్ అనే వ్యక్తి మోసం చేసినట్లు ఫిర్యాదుచేశారు. మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన రెడ్డి మాస్ దిలీప్ కుమార్‌కు కండ్లగుంట గ్రామానికి చెందిన కనుకర్తి సాగర్ బాబు ఆన్‌లైన్‌లో పరిచయమై కల్లబొల్లి మాటలతో నమ్మించి తన వద్ద నుంచి రూ33 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇసుక ట్రాక్టర్ పైనుంచి జారిపడి తలకు తీవ్రమైన గాయాలై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మొదటి పట్టణ పోలీసులు తెలిపిన ప్రకారం పట్టణంలోని నవయుగ నగర్‌కు చెందిన శ్రీనివాసరావు సోమవారం ఇసుక ట్రాక్టర్‌పై నరసరావుపేట వైపు వస్తూ చెరుకూరి హాస్పిటల్ వద్ద ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ఘటనలో శ్రీనివాసరావు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవిత కేంద్రంలో ఫిజియో థెరపిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూలు

నరసరావుపేట రూరల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా భవిత కేంద్రాల్లో ఫిజియో థెరపిస్టుగా సేవలందించడానికి సోమవారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో నాలుగు గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించినట్టు రవి తెలిపారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉండగా ఆరుగురు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు.

వైభవంగా ఆంజనేయ స్వామి తిరునాళ్ల

నూజెండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం గ్రామ సమీపంలోని కోటకట్ల ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే పరిసర గ్రామాలలోని భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలను నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులు భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా అవుల్లయ్య ...

బొల్లాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడు పాలెం గ్రామంలో ఆవుల్లయ్య తిరునాళ్ళ ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వేళ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గజవల్లి పాలంక్య కుమారుడు బాపనయ్య దంప తులు భక్తులకు అన్నదానం చేశారు. మొత్తం నాలుగు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటుచేసి వాటిపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంపద సృష్టి లక్ష్యంగా పని చేయాలి: ఎంపీడీవో

నాదెండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టించటమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీవో ఎన్.స్వరూపరాణి కోరారు. మండల కేంద్రమైన నాదెండ్లలో సోమవారం ఘన వ్యర్థాల నిర్వహణపై జరిగిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఏర్పాటుచేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం సంపద సృష్టించటంలో సత్ఫలితాలు ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొన్న వారు నాదెండ్ల కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఈవోపీఆర్‌డీ లక్ష్మీకుమారి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, కార్యదర్శి సుబ్బారావు, పలు గ్రామాల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి: పీడీఎం

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ కలిగిన మద్యం షాపులు గ్రామాలలో, తండాలలో మద్యం సరఫరా చేస్తూ అనధికార బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని పీడీఎం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ అన్నారు. సోమవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ బెల్టుషాపుల వలన పేద కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు షేక్ మస్తాన్‌వలి, నల్లపాటి రామారావు, టీఎన్ సంఘం నాయకుడు బాదునన్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణలో ఇరువైపులా భూమి సేకరించాలి

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ హైవే 544డీ విస్తరణలో భాగంగా ఇరువైపులా సమానంగా భూమి సేకరించాలని ఉప్పలపాడు రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు రెండువైపులా విస్తరణ చేయటం వలన ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుందన్నారు. రోడ్డు విస్తరణ రెండు వైపులా జరిగేలా నిర్ణయం తీసుకొని అందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాఘరి ఏడుకొండలు, కుంభా వంతులు, కాసా లక్ష్మీనారాయణ, మహేశ్వరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎఎఎం విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బేస్‌బాల్ నేషనల్ లెవెల్ యూనివర్సిటీ పోటీలకు ఎఎఎం పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ దయాల గ్రావ్య సోమవారం తెలిపారు. ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీలలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాల టోర్నమెంట్‌లో బేస్‌బాల్ పోటీలలో మూడో స్థానం సాధించారు. ఏ నంజయ్, బీ సాగర్‌లు నేషనల్ లెవెల్‌లో పంజాబ్‌లో జరిగే పోటీలకు ఎంపికయ్యారని చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు అన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, ఎంపీఏ హెచ్‌వోడీ నవీన్, ఎంబీఏ హెచ్‌వోడీ సితార, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటిపై అనుచిత వ్యాఖ్యలు సహించం: రాంబాబు

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో మంత్రిగా పనిచేసిన రజనీ టీడీపీపై దాడులు చేసినప్పుడు నోరు విప్పలేదని, ఇప్పుడు తన దాకా వచ్చేసరికి టీడీపీ మహిళా ఐదు చెప్పుకోవడం సిగ్గుచేటని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుపై మాజీ మంత్రి విడదల రజని చేసిన అనుచిత వ్యాఖ్యలను సహించమన్నారు. ఈ సందర్భంగా మున్నా రాంబాబు మాట్లాడుతూ మీరు మీ పార్టీ కార్యకర్తలు దగ్గర డబ్బులు తీసుకున్న మాట వాస్తవం కాదా అని, వారే మీపై కేసులు బనాయిస్తూ ఉంటే వాటి గురించి మీరు మాట్లాడకుండా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును విమర్శించడం దారుణం అన్నారు. సమావేశంలో టీడీపీ దానవి సాధికార సమితి అధ్యక్షుడు తుపాకుల అప్పారావు, రాష్ట్ర బీజేఎలు సంఘం అధ్యక్షుడు ప్రసన్నాంజనేయరాజు, టీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకర్ ద్వారా నీటిని పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

తాగునీటి సరఫరా ట్యాంకర్ల ప్రారంభం

బొల్లాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండలంలోని రేమిడిచర్లలో 16 గ్రామాలకు తాగునీటి ట్యాంకర్లను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యను తీర్చేందుకే గ్రామాల్లో ట్యాంకర్లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు గోవిందునాయక్, వెల్లటూరి రంగయ్య, నరసింహారావు, వాగ్యా నాయక్, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఊరిబండి కొండలు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూను పరిశీలించిన ఎమ్మెల్యే



జేఎన్‌టీయూ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం సందర్శించారు. కళాశాల నిర్మాణ పనులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరానికి తరగతి గదులు, హాస్టల్, క్రీడా ప్రాంగణం పూర్తి చేయాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, షేక్ మస్తాన్ షరీఫ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో 600కు పైగా సీసీ కెమెరాలు

● అర్బన్ సీఐ రమేష్ వెల్లడి



చిలకలూరిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో భాగంగా పట్టణ పరిధిలో ఇప్పటివరకు 600కు పైగా సీసీ కెమెరాలు ప్రజల సహకారంతో ఏర్పాటు చేసినట్లు అర్బన్ సీఐ పి.రమేష్ సోమవారం తెలిపారు. ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మహిళా పోలీసులు, తమ సిబ్బంది విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అవకాశం ఉన్నవారు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కెమెరాల ఏర్పాటుకు కేటాయించాలని కోరారు.

పరీక్షా కేంద్రాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ



వినుకొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో తనిఖీకి వచ్చిన డీఈవో చంద్రకళ

వినుకొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలతో పాటు బాలుర పాఠశాల, నరసరావుపేట రోడ్డులోని వివేకానంద టీటాడి కళాశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 26,497 మంది విద్యార్థులు 128 సెంటర్లలో పరీక్షలు రాస్తున్నారని, ఈ సంవత్సరం ఓపెన్ టెన్త్ ద్వారా 1100మంది పరీక్షలు రాస్తున్నట్లు ఆమె తెలిపారు.

రొంపిచర్ల మండలంలో ఎంతవో...

రొంపిచర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లోని 10వ తరగతి పరీక్షా కేంద్రాలను బొల్లాపల్లి మండల ఎంఈవో పార్వతి సోమవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రేషన్ కార్డుదారులు ఈ కేవైసీ చేయించుకోవాలి: తహసీల్దార్

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీలోగా కార్డుల్లో ఉన్న లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవాలని, నమోదు చేయించుకోకుంటే వచ్చే నెలలో రేషన్ సరుకులు ఇవ్వరన్నారు. మండల పరిధిలో 49,197మంది లబ్ధిదారులు ఉన్నారని, ఇప్పటి వరకు 43,853మంది లబ్ధిదారుల వివరాలు నమోదయ్యాయన్నారు. వీఆర్వో లేదా రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీని చేయించుకోవాలని కోరారు. ఆధార్ అప్‌డేట్ను ఎంపీడీవో కార్యాలయంలోని కేంద్రంలో చేయించుకోవచ్చన్నారు.



శివయ్య స్థూపం సెంటర్ వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సర్దార్ భగత్‌సింగ్‌కు ఘన నివాళి

వినుకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన సర్దార్ భగత్‌సింగ్ భారతదేశ యువతకు ఆదర్శం అని, ఆయన ఆశయసాధన కోసం యువత పోరాడాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల త్యాగాలను గుర్తు చేసుకుంటూ అఖిల భారత సమాఖ్య, సీపీఐ వినుకొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శివయ్య స్థూపం సెంటర్ వద్ద వర్ధంతి కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. వీరుల ప్రాణత్యాగాన్ని తలచుకుంటూ జోహార్లు చెప్పి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, వందనం, వెంకటేశ్వర్లు, సుభాని, మల్లికార్జున, మస్తాన్, కోటింవామ్, సైదావలి, మహబూబ్ ఖాన్, వెంకటేశ్వర్లు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో...

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏనుగుపాలెం రోడ్డు వరకు ప్రధాన వీధుల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పిరోజ్, మండల కార్యదర్శి దుప్పాటి నాని, ముసాపాటి ప్రసాద్, నాగేశ్వరరావు, ధామస్, దావీద్, దుర్గాప్రసాద్, కామా వెంకటేశ్వర్లు, బాష్ఛర్, చిన్నకృష్ణయ్య, ఆంజనేయులు, చిన్న, కొండలు తదితరులు పాల్గొన్నారు.